# 14

# దొంగ గొడ్డుకు లొటారం

మఱ్ఱిసెట్టు నల్లగుట్ట కాల్లకాన్నే ఉన్నట్టు కనబడ్తది గని మఱ్ఱికి నల్లగుట్టకు నడుమ మైలు దూరముంటది. మఱ్ఱి నుంచి పల్లెకు కోసుదూరం.

మఱ్ఱి చెట్టు ఈ పక్కనుంచి ఇంకో పల్లెకు వోయే తొవ్వ వోతుంటది.

గిదొక పల్లె పొలుమారు. నల్లగుట్ట ఆవల మల్లొక పల్లె. ఆడ గిట్నే మల్లో గుట్టత్తది. దూరం నుంచి సూత్తె గుట్టలొకతీర్గనే కనపడ్తయి గని గుట్టలకు నడుమ యెడమున్నది. గుట్టగుట్టకు నడమ వో పల్లె వున్నది. గుట్టల అంచుల పొంట పల్లెలకు తొవ్వున్నది.

కొన్ని తొవ్వలు మొన్న మొన్న కంకర్రోడ్లు చేసిన్రు. ఎటు జూసినా సేన్లల్ల పిల్ల తొవ్వలు కనపడతయి. అవి ఏడికోతయో తెల్వది. ఓటి తాడిసెట్టు కాడికోయి ఆగిపోతది. ఓటి ఒఱ్ఱెకాడికోయి ఆగుతది. ఓటి గుండుకాడికోయి ఆగుతది. ఓటోటి సక్కగ పోతనే వుంటది.

ఒఱ్ఱెల పొయిదీసిన బాయికాడ ముసలి యిప్పసెట్లు నీడకాడ నలుగురు కూసున్నరు.

"మంచిది. మరి మల్లెపుడు గలుత్తరు." అని అడిగిండు ఇంటున్న మనిషి.

"మీకు అప్పజెప్పిన పనైతె జెయ్యిన్రి. ఇంతట్లనే మల్లగలుత్తం లేకపోతె ఎవలనన్న తోలిచ్చి పిలిపిచ్చుకుంటం తియి." అన్నడు లుంగిమనిషి.

"మరి యిగ వోతం" అని ఇద్దరు లేసిన్రు.

"మంచిది" సాగనంపినట్టు అన్నడు లుంగి మనిషి.

"లాల్‌సలాం" పిడికిలెత్తి వీడ్కోలు సెప్పిన్రు అల్లు.

"లాల్‌సలాం" అన్నడు లుంగి మనిషి.

ఇప్పసెట్టు పక్కనుంచి ఈదుల్లకెల్లి అటుపడి యెల్లిపోయిన్రు.

"ఆల్సెమైపాయె. మన కోసం ఎదిరిసూత్తున్నరు కావచ్చు యిగ పోదామా" అన్నాడు అదివరదాక ఏమ్మాట్లాడని మనిషి. "అక్కడ ఎంత పరేషానైతున్రో మనకేమన్న అయిందేమోనని గిట్ట! జల్ది పోదాం పా" అన్నడు మల్ల.

"గట్ల పరేషానేం గారనుకో. ఆలిసెం గిట్టయితే గీడిదాక అచ్చి చూసిపోన్రి, ఈడ లేకపోతే జరగకూడదంది జరిగిందనుకొమ్మని సెప్పిన. ఇంక ఇటంకల ఎవలు రానట్టున్నరు గద. మందందరు జమైన్రో లేదో. లేకపోతే పోలీసుల పిలిపిచ్చి మనోల్లను ఏమన్న జేసిరో" అనుకుంట నిలవడి గట్టెక్కి పిల్లతొవ్వంట ఎవలన్న వత్తున్నరో అని నిక్కినిక్కి సూసిండు.

ఎవలో సైకిలేసుకుని యిటే అత్తున్నరు.

"అదేంది మొగలి మనకోసమే వత్తున్నట్టున్నడు" అన్నడు యిటుదిరిగి.

పిండి ఎండేసుకున్న బట్టలు మడతపెట్టి సంచిల ఓ పక్కకు పెట్టుకున్నరు. పోవుటానికి తయారైన్రు. కూసున్నకాడ ఆనవాలు లేకుంట సూసుకున్నరు.

"నమస్తే అన్నా!" అన్నడు మొగిలి అన్న దగ్గరకొచ్చి. ఒగ్రె అవుతల కేయి లొంతల సైకిల్లు అడ్డం పండవెట్టిన్రు.

"నమస్తె" అన్నడు అన్న. నల్లటి ముఖం మీద నవ్వు మెరుస్తూంది.

మొగిలెంట అచ్చిన శంకర్ని సూసుకుంట "ఏం శంకర్ బాగున్నవా ?" అని మందలిచ్చిండు అన్న.

జవాబు తీర్గ చిన్నగ నవ్విండు శంకర్.

"మరి పైలం సుమా! జాగర్తగుండాలె" అంటున్నడు బనీను లుంగీ మీదున్న మనిషి.

"మన కోసం ఎదిరిసూత్తున్నరు గావచ్చు పోదాం పాన్రి." అని అడుగు ముంగలకేసిండు మొగిలి.

'మేం రాన్ది ఎల్లదా'.

'మీ తోటి వాల్ల కట్టసుకాలుగూడ చెప్పుకుంటరట. మీరత్తనే లెక్కసేయకపోతే లేదు అన్నరు'.

'అయితే పద' అని అనుసరించిన్రు ఆల్లు.

“అదీగాక ప్రజలకోసం తిరిగెటోల్లకు ప్రజల నడుమ కచ్చుటానికి బయమేందట అని అంటన్రు.” అన్నడు శంకర్.

రెండు సైకిల్ల మీద నలుగురు ఆ పిల్ల తొవ్వ పొంటబడి పోయిన్రు.

అప్పుడోటి ఇప్పుడోటి సుడిగాల్పు లేత్తంది. ఎండిపోయిన ఆకులన్ని మొగులెత్తు లేత్తన్నయి.

2

ముసలి యాపసెట్టు. దానికి పది గజాల దూరాన ఓ కానుగు చెట్టు. దాని ఎదురుంగ ఓ గుడిసె హోటలు. ఆ హోటల్లనే ఒక ఆల్మరాసోంటి దాంట్ల బీడీలు సిగరెట్లు పాన్లున్నయి. గుడిసె ముంగట అటోటి యిటోటి బెంచీల తీర్గ పాతిన కొయ్యల మీద చెక్కలున్నయి. బూరుగు డబ్బమీద నిన్న జేసిన బోంది, పకోడి, పొడి అటుకులు మూతలల్ల పోసివున్నె. పంక్చరైన సైకిల్లను మంచిగ సేసే సామాను, పంపు, గోడకు ఒరిగిచ్చి ఉన్నది. హోటల్ గుడిసె పక్కకు ఏడెనిమిది సైకిల్లున్నె. అవి కిరాయికిచ్చేటివి కాదు గని ఎవరో ఆడ పెట్టుకున్నట్టున్నరు.

హోటల్ల ఎవరో సిగరేటు కొరుకుతోటి బీడీ ముట్టిచ్చుకొని కొరుకు వాపసిచ్చి ‘‘ఆల్లు రాకపాయిరి ఈల్లు రాకపోయిరి! ఇయ్యాలైతదంటవ.’’ అని ముచ్చటపెట్టిండు. ఆయనేదో అంటున్నడు. వోటల్ల ఆల్లు ఏడెనిమిది మంది జమైన్రు. ఏదోటి మాట్లాడుతనే ఉన్నరు.

“ఎవలో అచ్చినట్టున్నరు.” అన్నరు ఎవలో.

“ఎట్లంటవు?” అన్నరు మల్లొకలు.

“అదేంది లొల్లి బందయింది గద” అన్నడు ఒకాయెనె అటే సూసుకుంట. అందరు అటే సూత్తున్నరు.

ముసలి యాపసెట్టు కాడ ఇన్నూరు మంది దాకా జమైన్రు. వారం రోజుల నుంచి వాల్లు కూలీలు పెరుగాల్నని సమ్మె జేత్తున్నరు.

ఆ వూరి మోతుబరులు ఒకడుగు దిగచ్చిన్రు.

ఏడికో కాడికి మాట్లాడుకుందామని పిలువనంపిన్రు. గందుకే అందరు జమైన్రు ఆడ.

ఆడ పిల్లగాన్లు, పెద్దోల్లు, ముసలోల్లు, మొగోల్లు, ఆడోల్లు అందరున్నరు.

సీం పట్టురంగు దొడ్డుసీర గట్టుకుని జానెడెలుపు గోసి చెక్కి సికముడిసి కొంగు నడుముకు సెక్కి ఓ సెయ్యి అన్చి ఓ సెయ్యి నొసటికాడ నీడపట్టి "ఎహె అందరు కూసోన్రి" అని అందరు సూత్తున్నకేయి మునిగాల్ల మీద నిక్కి నిక్కి సూత్తుంది ఒకామె.

పెయి మీద అంగీ లేదు. తెల్లగ బుర్ర మీసాలు పెంచిండు. నెత్తంత తెల్లవడ్డది. పెయిమీద చిన్నది తెల్ల పంచేసుకున్నడు. దొడ్డుదోతి మోకాల్ల మీదికి బిగిచ్చి కట్టిండు. పెద్ద మనిషి తీర్గున్నడు. ఆయెనె కూసుండుమని అందరికేయి చేతులూపుకుంట "ఎహె ససరాదున్ని కూసుంటె అందరికి కనవడ్తది" అని కూసోవెడుతుండు.

"అగో మొగిలన్న, శంకరన్న అత్తన్రే" అన్నడు కూసున్నోడు లేసి సంబ్రంగ ఓ నెక్కరు పిల్లగాడు. ఒంటి జడేసుకున్న బక్కపొల్ల కూసున్న జాగలకెల్లి చెంగుమని లేసి సూసింది.

అట్ల ఒకలెనుక ఒకలు మల్ల అందరు లేసిన్రు.

"ఆల్ల దగ్గరికి ఎవలన్న సైకిలేసుకుని పోతె జల్ది పని ఒడిసిపోవు" అన్నరెవరో. సెట్టు కిందున్నోలకెల్లి హోటల్లున్నోల్లకెల్లి సెయివూపి "ఎవలన్న పోయిరాపోన్రి" అన్నడు ఎవలో.

"ఎందుకు అల్లు రారా!" అన్నడు ఇదివరదాకా బీడి తాగిన మనిషి.

"ఇదివరదాకుండి పాయిరి గదర! మనం బోయి సెప్పచ్చుడు సిన్నతనమా? గట్టంటే సిన్నతనం నుంచి ఆల్లకు ఎన్ని సేసిపెడితిమి ? పనిగావాలె ముందుగాల. పోయిరాపోన్రి." అన్నరెవరో మల్ల గుంపులోకెల్లి.

ఎవలో హోటల్ పక్కనున్న ఓ సైకిల్ దీసుకుని బయలెల్లిండు. "నేను గూడ అత్తపా" అని తయారైన్రు ఇంకో యిద్దరు.

యాపసెట్టు కిందున్న గుండురాయి మీద కూసున్నరు. మొగిలి శంకరిల తోటి అచ్చిన యిద్దరన్నలు.

అందరు కూకున్నరు. కొంచెం అడుసకని అయిదారుగురు పడుసోల్లు నిలబడే

వున్నరు. ఇంకో నలుగురైదుగురు తొవ్వ పొంట ఎవలత్తున్నది సూత్తున్నరు.

"కొంచెం ఆలసెమైంది" తప్పైందన్నట్టు చెప్పిండు మొదటన్న.

ఏమో సెపుతున్నడని అందరు లొల్లి బందుజేసి(న్రు.

గాలికి యాపకొమ్మలు, కానుగు కొమ్మలు ఊగుతున్న సప్పుడినవడతంది ఎవలో దగ్గుతున్న సప్పుడు, ఎవలో నెత్తి బ(రబ(ర గోర్లతోటి గీకుతున్న సప్పుడినవడతుంది.

సైకిల్ల మీద వూర్లెకోయినోల్లు ఆడికి సేరచ్చి(న్రు.

"ఎనక అత్తు(న్రు." అన్నరు ఆల్లు.

వోటల్ల యింకా ముగ్గురు నలుగురు ఏదో మాట్లాడ్తనే వున్నరు కొంచం సిన్నగ.

ఇదువరదాక సిగిరెటు తాగినాయినె అక్కన్నే వున్నడు గని ఆ ముచ్చట మనసున వడతలేదు. అటుయిటు అన్ని దిక్కుల ఎందుకో అనుమానంగా తేరిపార జూత్తండు. అటెన్క గుండురాయిమీద కూసున్న అన్నలకెయి సూత్తండు.

ఏందో యాదికిచ్చనట్టయి ఒక్కడుగు ముంగటికేసిండు. మల్ల ఎందుకు తియ్యి అనుకుని ఆగిపోయిండు.

ఇట్ల రెండు మూడు సార్లు తత్తరపడ్డడు. మల్ల వుర్లెకెయి వస్తున్న తొవ్వకేయి తేరిపార జూసిండు.

ఆల్లు వస్తున్నరు. వోటల్లకెయి మొకం బెట్టిండి. ఆల్లు వోటల్ దాటంగనే మల్ల వాల్లను తేరిపార జూసిండు.

ఏదో నిచ్చయానికి వచ్చినోని తీర్గ నడిసి యేపసెట్టు యెనుక సేరిండు. అన్నలను దగ్గరకెల్లి సూసిండు. ఏదో పిలువబోయిండు. సప్పుడుజేక ఊకున్నడు.

"మీరు ఎట్ల జెప్తె అట్ల యింటం. న్యాయంగ జెప్పు(ని. మీరడిగినంత కూలి యిచ్చి మీరడిగినంత జీతమిచ్చి పని జేపిచ్చుకుంటె యింత పెట్టుబడి పెడుతుంటె గూడ ఏమన్న వత్తందా ? అసలోనికి పెట్టిన పెట్టుబడి ఎల్లతలేదు. మీతోటి అసలోడు చిన్నదో పెద్దదో పనిజేత్తలేడా మరి! ఆ కైకిలి మందమన్న గిట్టువాటు

కావద్దా! ఈ వూల్లె దొరలెవలు లేరు. దోసుకోని తినెటోల్లు లేరు. అందరు రైతులే. కొంచెం పెద్దరైతు, కొంచెం చిన్నరైతు. గంతేగద! గివ్వన్ని విచారించుకొని చెప్పుౖని న్యాయం. మీరు యివ్వన్ని విచారించుకొని గూడ యివ్వుౖని అంటే ఎంతంటె అంత యిస్తం" అని యింకేదో సెప్తనే ఉన్నడతను.

ఇంకొకల్లు అందుకున్నరు. "చెప్పుకుంటె పెద్దురుకం గాదుగని నేను గూడ కమ్యూనిస్టుల పనిచేసినోన్నే. నైజాం జమానల నేను దొరలకు వ్యతిరేకంగా కొట్లాడినోన్నే." అని ఇంకేదో సెప్పవోతన్నడు.

ఎవలో గుంపులకెల్లి "గపుడు ఏం లేనోనివి గిపుడు ఇరువై ఎకరాలు తరి, పదెకురాల తోట, మూడు కరెంటు బావులెట్లయినై. నాకంటె ఎక్కువ కట్టబడ్డవా? ఉన్నొక్కెకురం నీకే అమ్ముకుంటి గాదుర" అని ఎక్కిరించిౖను.

"కమ్యూనిట్టుదొర" మల్లెవరో ఎక్కిరించిౖను.

మాట్లాడతానన్న కమ్యూనిస్టు దొర నోరు మూతవడ్డది.

"మేం కోరినయన్ని వాజీబుగనే వున్నయి" అన్నడు మొదటన్న.

యేపసెట్టు యెనకకు అచ్చినాయెనకు ముండ్లమీద నిలవడ్డటైతాంది. ఇగ ఆగలేకపోయిండు.

"అన్నా ఒక్క నిముషం" అని కొంచెం మెల్లంగ పక్కకు పిలిసిండు. గుండు మీదికెల్లి లేసి రెండడుగులు సెట్టెనకకెయి నడిసిౖను.

సప్పుడు లేకుంటునోల్లు ఏందో మెల్లమెల్లగ గుసగుసలు వెడుతుౖను.

"అన్నా ! గింత మందిల సాటుకు పిలిసిన్నని తప్పువట్టుకోకు. ఎట్ల చెప్పాన్నో తెల్వక గింతసేపు ఆగిన. వాల్లు పోలిసుల్ని తోల్కరమ్మని ఇద్దర్ని సైకిల్ల మీద తోలిచ్చిౖను. ఆల్లచ్చెదాక మీతోటి గిట్నే ఏదోటి యాల్ల గడువని అన్నట్టు మాట్టాడుకుంట జేర్తరు. మీరిక్కడుంటె ప్రమాదం. ఇటె ఎనుకకెల్లి ఎల్లిపోౖని" చెప్పుతుంటేనే ముచ్చెమటలు వోసినయి. అన్నలకేమన్న అపాయం జరగజిక్క అన్న భయంతోటి మాట వనుకుతంది.

అన్నలు యేపసెట్టు ఎనుకనుండి సంచులు దీసుకుని అవుతలకోతున్నట్లు మెల్లగా నడిసిౖను.

యాభై గజాల దూరందాకా బండ్ల బాటున్నది. అయితె వానకాలం ఒర్రె తీర్గ నీల్లు వారి ఆ బాట బాగ వంకైంది. బద్లు ఎత్తుమీదున్నయి.

ఒడ్ల పొంట వాయిలి చెట్ల యెవుటెవుటు వాసన ఇసిరికొడ్తంది. నిలువెత్తు యెదిగిన వాయిలిచెట్ల అవుతల ఏం గనిపియ్యది. ఆ వాయిలిచెట్ల నడుమ ఏర్పడకుంట వెల్లిపోవచ్చుననుకున్నరు అన్నలు.

ఎందుకైనా మంచిదని వాయిలిచెట్లు దాటి బాటల చేరేముందు వాయిలి చెట్ల దగ్గరదాక వోయి తొవ్వపొంట అటీటు జాగర్త కోసం సూసిన్రు. చెయి సంచిలకు సెయిబోయింది జాగర్తగున్నరు.

పగ్గం పెట్టు దూరంల పోలీసువ్యాను బండ్లబాట మీద వాయిలిసెట్ల సాటుకు ఇంజన్ ఆపుజేసుకుని ఉన్నది. ఎప్పుడొచ్చిందో ఏమో.

ఒక్కడుగు ముందుకేయబోయి పామును జూసినట్టు అట్లనే బీరిపోయి మెల్లగ యెనుకకు మర్రి యెడం పక్కకు పెరండ్లల్ల నడుసుడు మొదలువెట్టిన్రు.

వాల్లెందుకు లేసిపోయిన్రు, యెటువోతున్నరు అని అక్కడ మీటింగు లున్నకెవలకు సమజు గాలేదు. అందరు అటే సూత్తాన్రు.

రెండు మూడు పెరండ్లు దాటితే బండ్లబాట తూర్పు దిక్కు మలుగుతది. పోలీసు వ్యానుకు కన్పియ్యకుంట అదే బాటెంబడి యెల్లిపోవచ్చు. తొవ్వ గుట్ట బోరు పక్కకెల్లి పోతుంటది. గుట్టెక్కి అవుతలి పక్కకు దిగె కాలిబాట గూడ ఓటున్నది. అట్ల వడి పోవచ్చునని ఏంతో జాగర్తగ జెల్ది జెల్ది నడుస్తున్నరు.

పోలీసు వ్యాను స్టార్టు జేసిన సప్పుడైంది. అయితె అది వీల్లు వోతున్న కెయి తిరుగాలంటె కేక పెట్టు దూరం అట్లనే ముంగటికోయి ఆడ మలుపుకొని మల్ల యెనుకకు రావాలె.

అయితె పోలీసులు దిగి రైఫిళ్ళు పొజెషన్ల పెట్టుకుని నడుస్తున్నరు వాయిలిసెట్ల సాటునుంచి.

బండ్లబాట మలుపచ్చింది. బండ్లబాట పొంట పోవాల్నంటె గుట్టసుట్టు దిరుగాలె.

ఆ మలుపు మలుగక సక్కగవోతె పిల్లబాటపొంట గుట్ట జెల్ది దిగవచ్చు.

బండ్లబాట లాభం లేదనుకున్నట్టున్నరు. పిల్ల తొవ్వ తొక్కి వురికిన్రు.

“రైరో మాక్కె లవుడె! షూట్ కర్‌దేంగే ! రైరో” బూట్ల సప్పుడు.

అంతట్లనే మలుపుకచ్చిన పోలీసువ్యాను ఆడికి సేరచ్చింది. భయానికో భక్తికో ఆన్లెక్కిన్లు. వ్యానటు, వాల్లిటు వురికిన్రు.

వ్యాను వోయింది గదాని వాపసు వోదాం అనుకుని ఎనుకకు మర్రి సూసిన్రు. ఒక ఇద్దరు ఆల్ల వెనుకే వురికత్తన్రు పోలీసులు.

ఆటురికి గుట్టబోరు దిగితె మల్ల పోలీసు వ్యానుంటది. ఇటూ పోలీసులు.

ఎనుకత్తున్న పోలీసు రైఫిల్ పేల్చినట్టున్నడు ఉరుక్కుంట. అయితె బొడిగెరాల్లల్ల బూట్లతోటి ఉరుక్కుంట కాల్సెసరికి అది కొంచెం ముంగట భూమిల దిగింది.

చిన్న చిన్న పొరుకలు కాల్లకు గీరుకపోతున్నయి. కాల్లకు చెప్పులెక్కడ జారిపోయినయో. కట్టుకున్న లుంగీ ఊసిపోతంది, బిగిచ్చి కట్టుకునే సమయం లేదు. ప్రాణాలు ఇగ పోయినట్టే అనుకున్నరు. అయినా ఉరుకేది ఆపలేదు. ఉరుకురికి గుట్టబోరు ఎక్కిను. ఇగ గుట్టబోరు దిగుడే తరువాయి. గుట్టబోరు దిగుతె పోలీసులు ఆ గుట్టబోరు ఎక్కి ఎక్కడున్నా గూడ కాల్చిపారేయొచ్చు.

గుట్టబోరు దిగేముందు ఒక్క క్షణం అట్లనే ఆగి దమ్ముతోటి ఎగవోసుకుంట కండ్లల్ల పేరిన నెత్తురుతోటి ఒక్కసారి ఎనుకకు దిరిగిన్రు. సెయి సంచిలకెల్లి రెండు చేతిబాంబులు తీసి పోలీసోల్లకెయి అందినంత దూరం ఇసిరిన్రు. ఓటి పేలింది. మరోటి పేల్లేదు.

అన్న ఆగంగనే పోలీసోల్లు ఆగిపోయిన్రు. సంచిలో సెయి పెట్టగనే యాభై అరవై అడుగులు వెనక్కి ఉరికిన్రు.

ఒకన్న రాళ్ళు దట్టి బోర్లబడ్డడు. మోకాల్లు పగిలినై. ముక్కు, గదువ పలిగి నెత్తురు గారుతున్నయి. ఎక్కడో తగలకూడనికాడ దెబ్బ దాకినట్టు అయింది. మూర్ఛవచ్చినట్టయింది. లేవ సాతనైతలేదు. ఇక అయిపోయింది అనుకున్నడు. “కామ్రేడ్ పరుగెత్తు” అని లావట్టి చెయివట్టి గుంజుకపోయిండు ఇంకో అన్న.

సచ్చుడు ఖాయం అని తెల్సినా అట్ల వురుకుతనే ఉన్నరు.

పొద్దు గుంకుతున్నది. పోలీసు వ్యాను సప్పుడు సావుకేక తీర్గ యినవడ్తున్నది.

కాల్లు సీర్కపోయి మంట మండుతున్నయి. పిక్కల నుంచి మొదలువెట్టి అరిపాదం దాక నెత్తురు కారి నల్లవడి అట్టగట్టినయి. నోరెండుకపోతంది. లుంగీలెక్కడ వూసిపోయినయో ఎవలకు తెల్వది. జాంగబనీను మీదున్నరు. ఓ గుండుసాటుకు దమ్ము తీసుకుంటున్నరు. ఎక్కడలేని ఎగబోత అత్తంది.

తుమ్ములు అచ్చెటట్టున్నయి. తుమ్మితే శత్రువుకు ఆసూకి తెలుస్తది. ప్రాణం పోతది. తుమ్ము రాకుంట ముక్కు నలుసుకుంట బిగవడ్తుంటె ఇట్ల పానం బోతున్నది.

అల్ల దమ్ము ఎగవోత ఆల్లకె బయమయ్యేటట్టు ఇనవడుతుంది. ఇగ ఆ గుండు సాటుకున్న జాడ దొరికెనా ఖతమే. తెల్లారి ఎన్‌కౌంటర్లో ఇద్దరి మృతి అని పేపర్ల వచ్చుడు ఖాయం అనుకున్నరు.

"కామ్రేడ్, నీకు దండం బెడత, నేను నడ్వలేను, నువ్వొక్కనివన్న ప్రాణాలు కాపాడుకోపో" అన్నడు ఒక అన్న.

"కామ్రేడ్ ఇలా ఈ గుండు సాటుకు సచ్చే బదులు పరిగెత్తుతూ చచ్చిపోదాం కామ్రేడ్. ఏమైనా గాని ఇంకో గంట పరిగెత్తాల్సిందే, గుండ్లకు బలైనా సరే. ఈ గుండు సాటుకుంటే మాత్రం తప్పక చస్తాం. పరిగెత్తితే బతికే అవకాశం ఉంటుంది. పద కామ్రేడ్."

వ్యాన్ గుట్ట కింద అటిటు చక్కర్లు కొడుతున్నది. వెనకున్న పోలీసోల్లు యెతుకుతనే వున్నరు.

గుండు సాటు నించి అట్లిట్ల దిగి బండ్లబాట దాటి పొలాలల్ల వడ్డరు. మల్ల ఉరుకుడే. చెట్లే అడ్డంలేవు. పది నిమిషాలల్ల వ్యాన్ చూసి వాళ్ళ ఎంటబడ్డది.

అయితే పొలాల గట్లున్నయి. అట్ల వ్యాన్ పోరాదు. అంతట్లనే యింకో పోలీసు జీపచ్చింది.

వ్యాను రోడెంబడి పోతంటే జీపు పొలాలపొంట వొడ్ల మీంచి వోతున్నది.

ఎత్తెత్తు వొడ్ల కాడ దిగవడ్డప్పుడల్ల పోలీసులు దిగి జీపును అమాంతం లావట్టి మల్ల వురుకుడు.

అన్నలు ఉరికి ఉరికి ఒక నిమిషం ఆగిన్రు. ఆలోచించిన్రు. ఒక వ్యాను

పోయి రెండు వ్యాన్లయినై. ఉరికి బతుకుడు కల్ల. అందున అన్ని పొలాలే చెట్లు లేవు సాటు లేదు. ఎవరో ఇద్దరు సైకిల్ల మీద వోతున్నరట్ల.

"అన్నా! దండం బెడ్తం మమ్ముల గీవూల్లె పడగొట్టి పోన్రి" అన్నడొక అన్న.

రేగిన నెత్తి, బనీను జాంగ, ఎగపోత, తుమ్ములు. పెయంత సీరుకపోయి కారిననెత్తురు జూసి ఏమనుకున్నరో ఏమో.

"మీకు కావాలంటె ఓ సైకిలిత్తం. మేం డబల్ పోతం. మీరు ఫలానకాడ పెట్టున్రి. రేపు తీస్కపోతం సైకిలు." అన్నరు.

కొరిజీవునాన్ని లెక్క పెట్టక చిన్నన్నను ముంగట కూసోపెట్టుకొని పెద్దన్న నెత్తురు గారుతున్న పాదాలతోటి జాంగతోటి ఏదో పల్లె జేరిండు. అక్కడ గూడ ఏదో జీపు ఎదురుంగ వత్తున్న సప్పుడైంది. వెంటనే దిగి దగ్గరున్న ఓ కొట్టంల సైకిల్ పెట్టి ఏదో కనపడ్డయింట్ల చొచ్చిన్రు. కొన్ని మంచినీల్లడిగిన్రు.

దుమ్ములేత్తంది. గొడ్డుగోదలు పల్లెకు చేరుతున్నయ్. తొవ్వల నింద అవ్వే అయినయ్. పెద్దన్న "అమ్మా ! మేం రైతుకూలి కార్యకర్తలం. ఎవలన్నా మా కోసం వస్తె లేరని చెప్పున్రి. మేం! గీ గడ్డికుప్పల్ల కొంచెం సేపు వొరుగుతం" అన్నడు ఆయాసంగా.

విన్నదానికన్నా సూసిందానితోటి ఎక్కువ సమజైంది వాల్లకు. పెద్ద దరువాజ గొల్లెం బెట్టిన్రు లోపల్నుంచి.

తుమ్ములు మొదలయినై. తుమ్ము మీద తుమ్ము. తుమ్ములే ప్రాణం తీసేటట్టున్నయనుకున్నరు. బలవంతంగ ముక్కులు నలుసుకుంటున్నరు.

వూర్లెకు వ్యాన్లచ్చి తిరుగుతున్న సప్పుడైంది. తొవ్వకడ్డం వున్న గొడ్డుగోదలను 'పంపం' అనుకుంట అదిలిస్తున్న అలికిడైంతంది.

తాగిన నీల్లకు వాల్లకు సెమటలు గారుతున్నయి. ఉప్పు సెముటకి దాకి తాకిన దెబ్బలు మంట మండుతున్నయి. కడుపుల ఆసర లేకుంటున్నది.

ఏం సాతనైతలేదు, ఆండ్ల వొకటే తుమ్ములు.

చిన్నన్న గడ్డిల పీనుగ తీర్గ పడిపోయిండు. ఇంటోల్లు ఎవలూ ఆ గడ్డి కుప్పకేయి రాలేదు. పావుగంట గడిసింది.

ఎక్కోసేపు అక్కడుంటె ప్రమాదం. ఆ యింట్లకు కూడ పోలీసులొస్తరు.

'అక్కా పోతం' అన్నరు వాల్లు.

'ఒక్క నిముషం ఆగున్రి' అని ఇంట్లకోయింది అక్క. రెండు పాత దోతులు తెచ్చిచ్చి 'ఇవి గట్టుకోన్రి' అన్నది.

ఆ పాముగంకు అన్నల కండ్లల్ల నీల్లు సుడిదిరిగినై. గుండెల దుక్కమో ఏంటిదో నోట్లెకెల్లి మాట రాలేదు.

ఆ దోతులు మడ్తవెట్టి లుంగి తీర్గ సుట్టుకున్నరు. పెద్దరువాజకెల్లి సందిలపడ్డరు. ఆల్ల పరారిగోడ పొంట నడుసుకుంట సందిలవడి మాదిగ గూడెం కేయి చేరిన్రు.

అట్ల బండ్లబాట తోటి వస్తె మాదిగగూడెమే ముందు అంటుతది. పోలీసోల్లు అట్లనే అచ్చి గూడెంల ఇండ్లన్ని యెతికిన్రు. గూడెం నుంచి ఊల్లెకు బయలెల్లిన్రు.

ఊల్లిట్ల ఎనుకకెల్లి గూడెంల పడి ఎరుకున్న గుడిసెల సొచ్చిండ్రు.

సాయిలు ఇంట్లనే వున్నడు. 'పోలీసులు గట్ల గెల్లిపోవుడు. అన్నలు గిట్ల వచ్చుడు. కొంచెం ముందుగిట్ల అన్నలైతె ఎంత పరేషానైపోవు' అని బయపడ్డడు.

ఎప్పుడు ఎంత దివాలైనా ఎన్ని రోజులుపాసంలున్నా మిలమిల మెరిసే కండ్లు బీరిపోయి లోతుకోయి అల్సిపోయినై.

సాయిలు వాల్లను ఎక్కువసేపు విసిగియ్యలేదు. లోపల్నే పండుకొమ్మని చెప్పి అవుతల గొల్లెం పెట్టి తాలమేసి పోలీసోల్ల ముచ్చట్లు మాట్లాడుతున్నవాల్ల గూడెపోల్లతోటి గల్సి మాట్లాడ్తనే ఉన్నడు. ఎవలో పోలీసోల్లను సాపిత్తనే వున్నరు.

అక్కడ ఊల్లెకు పోయిన పోలీసులు యిల్లిల్లు ఎతుకుతున్నరు.

ఆ పెద్ద దరువాజ కాడ కింద సిమెంటు జేసున్నది. రెండు తంతెలున్నయి. అవ్వీటి మీద పాదాల నెత్తురు మరకలున్నై. అది జూసి పోలీసులు ఓ క్షణం అన్నే పరీక్షవట్టి సూసి ఆగిపోయిన్రు.

తలుపు నూకిన్రు. లోపల గొల్లెం బెట్టున్నట్టుంది. తలుపు దియ్యండ్రని గొల్లెం గొట్టుకుంట లొల్లి వెట్టిన్రు.

అక్క వచ్చి తలుపు దీసింది.

పోలీసు అమీన్ ఆయాసంతోటి ఎగపోత్తున్నడు.

ఒకసారి పోలీసుకెయి జూసి తలదించుకున్నది. కింద సిమెంటు తంతెల మీద నెత్తురు మరకలు గనవడుతున్నై. ఒక క్షనం గుండె దిటవు జేసుకున్నది.

'యిక్కడికెవలన్న వచ్చిన్రా' క్రూరంగ చూసుకుంట యిగదొరికినట్లే ననుకుని ధైర్యంగ అడిగిండు.

"వచ్చిన్రు." న్యాలకేసిన మొకం ఎత్తి పోలీసులకెయి ధైర్యంగ జూసింది అక్క.

"ఏరి" అని లోపలికి అడుగెయ్యవోయిండు.

"ఇక్కడికస్తె యెల్లగొట్టిన ఈడవుండద్దని. వెంటనే ఎల్లిపోయిన్రు" కండ్లల్ల కండ్లువెట్టి ధైర్యంగ చెప్పింది అమీను తోటి.

ఏం జేయ్యాన్నో తొయ్యలేదు పోలీసులకు, సిక్కినట్టే సిక్కి మాయమైన్రు అనుకున్నరు.

ఎవల్నో తిట్టినట్టు తిట్టుకుంట లోపల అటీటు ఓసారి జూసిన్రు. ఇల్లంత ఎతికిన్రు. పోలీసుల యెంటున్న సుంకరోడు "ఇది మన పోలీసు పటేలు తమ్ముని ఇల్లు దొరా! ఆల్లు గీడెందుకుంటరు బాంచెన్" అని తాపకోసారి అంటనే వున్నడు. వూర్లె యాల్లకు పోలీసు పటేలు లేడు. తమ్ముడు లేడు. ఇంట్ల మొగోల్లెవరు లేరు. "నువ్వుండంగ పోలీసోల్లు గిట్ల ఇంట్ల ఎట్ల జొచ్చిన్రురా" అని అచ్చినంక అడుగుతరని వాని భయం వానికున్నది.

3

మూడు వారాలైంది. మల్లదే యాపసెట్టు కింద మల్ల ఆల్లందరు జమైన్రు.

మూడు వారాలకింద ఆ యాపసెటు కింద జమైనోల్లందర్ని కొట్టి దొరికినోల్లను పట్టుకుపోయి నాల్రోజులు లాకప్పులో వేసి కొట్టిన్రు. ఏదో కేసు పెట్టి జమానతు మీద ఇడిసిపెట్టిన్రు.

మోతుబరి రైతులు ముఖ్యంగ కమ్యూనిస్టు దొర వాల్ల యిడుదల కోసం నాల్గయిదు సార్లు అమీన్‌ను కల్సిండు. వాల్లకు లాకప్పుల సిల్లరకు పైసలిచ్చిండు. తనకేర్పాటున్న వకీల్ను పెట్టి జమానతు మీద ఆల్లనిడిపిచ్చిండు.

ఇవుతలకచ్చినంక వాల్లదగ్గర కర్చుల కింద మనిషికి నూరు పట్టిచ్చిండు. వకీలు ఫీసు వేరే మాట్లాడుకోవాలన్నడు.

పోలీసులెట్ల వచ్చిన్రో ఎందుకచ్చిన్రో అన్నల గతి ఏమైందో ఆల్లకు తెలువలేదు. కొందరికి ఇదంత మోతుబరులే ముందుగాల్ల ప్లానేసుకుని చేయించిన్రేమోనని అనుమానం వచ్చింది. కని ఆల్లే జమానతుండి ఈల్లను యిడిపిచ్చిరి. పైసలు యిచ్చి అర్సుకునిరి. గందుకే ఏమనరాకున్నది. ఎవల మనసుల వాల్లకు వుడుకుతున్నది.

కూలీ పెంపుదల పోరాటం మాత్రం ఆగిపోలేదు. ఇంక అది ఎటు తెగలేదు. పనులు ఈ లొల్లిల అట్లనే ఆగిపోయినై.

మల్లోసారి కూసుండి మాట్లాడుకుందామని వీల్లు వాల్లు అనుకున్నరు. సరెనన్నరు అందరు.

అయితే మోతుబరులే ఇదంత ఎవలకు తెల్వకుంట జేసిన్రని ప్లానేసి ఆల్లను రప్పించేటట్లు జేసి అన్నలను పోలీసులకు పట్టిద్దామని ప్లానేసిన్రని, ఐతే ఎట్లనో కొరిజీవునాలతోటి అన్నలు బతికిన్రని సంగపోల్లకు తెలిసింది.

అయితే మోతుబరులు ఇంకా మననెవలు అనుమానిస్తలేరని నిర్రందిగ వున్నరు. అందుకే మల్ల మీటింగంటే మంచిదని వొప్పుకున్నరు.

"మొన్న పోలీసుల పిలిపిచ్చినోల్లెవలో ముందుగాల తేలాలె" ఎవలో గట్టిగన్నరు.

మోతుబరులకు భయం బుట్టింది. ఏదో ఓటి జెప్పి అన్నుంచి జెల్ది పీకాలె అనుకున్నరు. కాని పోయెటట్టులేదు. ఏం జెయ్యాన్నో సమజైతలేదు.

ఎవలో లేసి రెండడుగులెయ్యావోయిన్రు. "ఎవర్రా ఆడు" గుంపులకెల్లి మల్లెవలో లొల్లి వెట్టిన్రు.

"మా యియ్యపుడచ్చిండు. కొంచెం అర్సుకోవాలె గద!" అని ఏందో చెప్పబోయిండు.

"అచ్చిన యియ్యపుడు ఎటువోడు. పొద్దుగూకి కోన్ని గాదు గొర్రెనే గోసి పెట్టు" సుట్ట తాగుతుంటె నోట్లె ఊరిన నీల్లు తుపుక్కున ఊంచిన్రు ఎవలో.

అంతెట్లనోవున్నదని మోతుబరులు ఎవల మనసుల ఆల్లు బయపడ్తాౖను కని ఏమ్మాట్లాడలేదు. ఎం మాట్లాడితే ఏమంటరోనని ముడుసుక కూసున్నరు.

"ఊల్లెదూల్లె తప్ష జేసుకుందామన్నది మీరే. అన్నలెట్ల జెప్తె అట్ల ఇంటం అన్నది మీరే, అన్నలెందుకు మేం లేమా మాట్లాడటానికి అంటె మా కట్టసుకాలు గూడ సెప్పుకుంటం అంటిరి. ప్రజల మనిషి ప్రజల నడిమికి వచ్చుటానికి భయమేంది అంటిరి. ఏదన్నైతే జిమ్మెదారు మేమే అంటిరి. అంత అని అంత జేత్తిరి. గిపుడా అన్నలెక్కడున్నరో ఎవలు పట్టుకుపోయిౖనో కావలె మాకు".

"మల్ల మా మీద కేసులు వెట్టిౖను. ఎవల నేమన్నమని ? ఏ మాట కా మాటనే సెప్పుకోవాలె. జమానతు మీద యిడిపిచ్చింది మీరే. గది మాత్రం నిజం కని నూరైతె ఒడిసె గద. నూౖరూపాయలంటె ఎవలకన్న ఇంట్ల పుట్టినయా పైసలు, అరువ కట్టాలువడి ఇడిపిచ్చుకుంటిమి. పోలీసోల్లను పిలిపిచ్చిందెవలో గని ఆల్లకు నేను జెప్పేది ఒకటె మాట. ఆల్లు మీకు ఎల్లకాలం కావలిగాత్తరా? మీ పొలాలు దున్నుతరా? నాట్లేత్తరా? ఎల్లకాలం ఒక్కార్లుండేది మనం. గది ఆలోసించుకోవాల. ఊల్లెకెల్లి దెంకపోతం అనెటోల్లకు ఎవలేం జెప్పేది లేదు గని" శంకరి కొంచెం గట్టిగనే అన్నడు.

సీమ సిటుక్కుమన్న ఇనవడెటట్టున్నది. ఎవలో ససరాదుర అని గుసగుస పాలుజీకే పిల్లగాన్ని సముదాయిస్తున్నరు. ఎవలో అగ్గిపుల్ల గీకిన సప్పుడైంది.

శంకరి అందరికేసి కలెజూసిండు.

మోతుబరులు తల యెత్తుతలేరు.

కమ్యూనిస్టు దొర లేసిండు. ఓ సారి సభను సుట్టుసూసిండు. "సరె జరిగిందేదో జరిగిపోయింది. అనుకుంటె వత్తదా? పోలీసుల కెవలన్న జెప్పిౖనా లేకపోతే పోలీసులే వాల్లిచ్చి వాల్లే అచ్చిౖనా అన్నది యియ్యాల గాకపోతే రేపు తెలువకమానది. గపుడు ఏం జేత్తామన్నది అనుకుందాం గని అంతదనుక జరుగుతనే వుండాలె గద."

"అంటె ఏందె రాజన్నా ! మేం పోలీసుల్తోటి దెబ్బలకు సత్తెసత్తిమి. అన్నలు సత్తెసచ్చిరిగని మీ పొలాలు ఎండద్దు, మీ పనులాగదుం. ఏడికో ఒకాడికి కూలీలు జీతాలు పెంచుకునే ముచ్చుట మాట్లాడుదాం ముందుగాల అంటవు."

మొగిలికి కోపం ఆగుతలేదు. ఏం జేత్తె మంచిగుండు వీన్ని అని మనుసుల అనుకుంటండు గని గింతమందిల ఏమనలేక కోపం బిగవట్టి వూకున్నడు.

అందరు పోలీసుల పిలిపించినోన్ని తన్నాలె, గుద్దాలె, కాల్లిరుగగొట్టాలె, వూల్లెకెల్లి ఎల్లగొట్టాలె అని ఎక్కడోడక్కడ గట్టిగనే అనవట్టిన్రు. మీటింగు లొల్లి లొల్లయితంది.

"హె హె ఆగున్రి" గట్టిగ ఒర్రిన్రు ఎవలో. లొల్లి మగ్గి గుసగుసలు మొదలైనై.

సొట్ట దౌడలు, బొక్కినోరు, ఎండిపోయిన తోడుకల తీరుగున్న మైసడు లేసి బొక్కల తీర్గున్న కర్రెసేతులూపుకుంట లేసి నిలవడ్డడు.

"గది గిప్పట్ల తేలది గని తెల్సినంక దొంగ గొడ్డుకు లొటారం గట్టినట్టు ఎరుకపెట్టాలె. గట్లయితే ఇంకోల్లకు బయముంటది. గునమత్తది."

అందరు గా మాట మీద మాట్లాడుకొని గదే ఖాయం జేసుకున్నరు కూల్లు జీతాలు మాత్రం వాల్లన్నంత పెరిగినై.

మీటింగయిపోయింది. ఎక్కడోల్లక్కడ లేసిపోతన్రు.

"ఒక్క నిముషం ఆగున్రి" గట్టిగ కేక పెట్టిండు ఈరేశం.

ఎక్కడోల్లక్కడ ఆగిపోయిన్రు.

"తప్పులందరు జేత్తరు గని సరిదిద్దుకున్నోడే బుద్దిమంతుడు" అన్నడు అందరికేసి సూసుకుంట.

"ఇప్పటికైన పోలీసుల పిలిపిచ్చింది నేనేనని గింతమందిల తప్పైందని ముక్కు భూమికి రాత్తె అందరికి మంచిది."

అందరు ఔఔ అన్నరు.

మోతుబరులు ఒకరి ముకాలొగలు సూసుకున్నరు.

ఎవలు మాట్లాడలేదు.

"సరె తియ్యి! మనం ఆఖరి చాన్సు గూడ యిచ్చినం. ఇగ మన తప్పైతె లేదు. పోదాం పాన్రి." అన్నడు ఈరేశం.

అందరు కదిలిన్రు. మోతుబరుల మనుసుల గుబులైంది. ఉరిమి వురిమి పిడుగు ఎవలమీద పడతదోనని.

4

పొద్దంగుతున్నది. తప్పుజేసినోన్నని తప్పుజేత్తున్నపుడే దొరకపట్టిన వోల్లె యిజ్జతువోయి ఏమనరాక కోపంతోటి ముకమంత ఎర్రబడ్డట్టు మొగులు ఎర్రవడ్డది.

తొవ్వ పొంట గొడ్డుగోదలు దుమ్ము లేపుతున్నయి.

గొడ్డువోయిన రెండు మామిడి సెట్ల నీడ కింద పొద్దంగేదాక గొడ్డు గోదల మందలు పెట్టుకున్నరు. కిందంత రొచ్చురొచ్చున్నది. పెండంత ఎవల మందది ఆల్లు యేరే పెంట కుప్ప జేసినట్టున్నరు. తాటి ముంజలు తీసిన ఉత్త బుర్రలు, ఎండిపోయిన గెలలు, తాటిమట్ట, పొయిల కక్కరకత్తయని ఎవలో సెట్టుకింత దూరాన ఎండతగిలేకాడ మండెలు పోసుకున్నట్టున్నరు.

గొడ్లుగాసె పిలగాన్లు ఈతపండ్ల గెలలు తెచ్చుకుని తిన్నట్టున్నరు. మామిడిసెట్టు మొదలుకాడ అన్ని ఎండిపోయిన ఈతగింజలున్నయి.

అన్న రమ్మంటున్నడని రాజన్నను తోలుకొని మొగిలి, ఈరేశం, శంకరి ముగ్గురు గలిసి ఆ మామిడిసెట్టు కాడికి సేరిన్రు.

అక్కడ పెద్దన్న వున్నడు.

“నమస్తే అన్నా!” అన్నరు అందరొకటేసారి.

“నమస్తే” అన్నడు పెద్దన్న.

పెద్దన్నను సూసెటాల్లకు తననేమన్న జేత్తరో అని రమ్మంటే ఒక్కడినే అత్తని. అయ్యో ! ఎవనికన్న సెప్పకపోతి అని బయపడ్డడు రాజన్న.

పులిముంగల మేకను గట్టేసినట్టు బయంతోటి బీరిపోయిండు రాజన్న.

“నమస్తే రాజన్నా” అన్ని నవ్వుకుంట మందలిచ్చిండు పెద్దన్న.

నమస్తే అన్నడు రాజన్న బెరుకుబెరుకు కొంచెం పోయినట్టయింది రాజన్నకు. అది గాక పెద్దన్ననే తనకు నమస్తె పెట్టెటాల్లకు ‘పెద్దన్న నాకు నమస్తె పెట్టిండు’ అని మనసుల కొంచెం సంబ్రపడ్డడు. నన్ను పెద్దమనిషిగనే సూత్తున్నరు గద నన్నేం జెయ్యరు గని అని కొంచెం ధైర్యం తెచ్చుకున్నడు రాజన్న.

భూమిలకు దిగిన సెట్టు యేర్లమొదల్లు మీదికి దేలినై. మందగాసే పిలగాన్లు కూసుండి కూసుండి నున్నవడ్డ మొదుసులమీద సదురుకొని కూసున్నరు.

"రాజన్నా!" పెద్దన్నకెయి తిరిగి పిల్సి అన్నడు. "తెల్సి తెల్సి ఈతకొయ్యల పడ్డెట్లనే" అడిగిండు. రాజన్న గుండె దడదడ గొట్టుకున్నది.

"నువు నైజాం జమానల కామ్రేడులకు సద్దులందిచ్చినవు. పదిపన్నెండేండ్ల పిలగానివి అపుడు! గపుడే నువ్వు ఎంతో పనిజేసినవు. రజాకార్లను, మిలిట్రీవోల్లని ఎట్ల తప్పిచ్చుకొని తిరుగాలె, అన్నలకు ఎట్ల సద్ది అందియ్యాలె అనేది నేర్చుకున్నవు. అన్నలెక్కడెక్కడుంటరో నీకు తెల్సినా ఎవలకు జెప్పలేదు.

ఓసారి రజాకారు గల్సి సద్దెటురా అని ఈడ్సి సెంపమీదికెల్లి నాలుగయిదు సరిత్తె దోతిలేరుక్కున్నవు గని ఏం జెప్పలేదు. మా అయ్యకే సద్దిదీస్క పోతున్న అని ముందుగాల జెప్పిన మాట మీదికెల్లి దిగలే నువ్వు."

రాజన్న జేసిన ముచ్చట్లన్ని యాజ్జేసిండు పెద్దన్న.

రాజన్నకు గట్ల యాజ్జేత్తంటే ఎంతో సంబ్రమైంది. గొప్ప వీరుని తీర్గ మనుసు యిదైపోయింది. పాత ముచ్చట్లన్నీ యాదికచ్చినై.

అవు. అపుడు గింత సిన్నపోరడుగని ఎంత పనిజేసిండు. ఎంత ధైర్యం గవన్ని గిపుడు మెచ్చుకునేటాల్లకు సంతోసంతోటి పెయ్యంత జడితిచ్చింది.

మల్లందుకున్నడు పెద్దన్న. "గపుడు మీరు గుంజుకున్న భూములన్ని మల్ల దొరలపాలే అయినయి. మల్ల ఎక్కడేసిన గొంగలి అక్కన్నే వున్నట్టయింది. దెంకపోయిన దొరలు మల్లచ్చి దొరతనం సాగిచ్చుడు మొదలువెట్టిన్రు. గదాంట్ల నీ తప్పేం వున్నది గని."

రాజన్న గాలిగొట్టిన బుగ్గ తీర్గ ఉబ్బిపోయిండు.

శంకరి బీడి ముట్టిచ్చిండు. అదే అగ్గిపుల్లతోటి మొగిలిగుడ బీడి ముట్టిచ్చుకున్నడు.

గౌండ్లోల్లు కల్లమ్ముదైనోల్లు కావడి భుజానికేసుకొని ఇంటితొవ్వ పట్టుతున్నరు. కావడికి వాడుకం బింకులో ఏమో అటు రెండు ఇటు రెండు యాల్లాడుతున్నయి.

“గట్ల వోతున్నది యెల్లన్ననే గాదు.” అన్నడు ఈరేశం అట్ల దూరం నుంచి నడుస్తూ పోతున్న గౌండ్లాయెను సూపుకుంట.

“గట్లనే వున్నడు” అన్నడు పరీక్ష పట్టి సూసుకుంట మొగిలి.

మొట్టుమీదికెల్లి కొంచెం జారినట్టయి మల్ల సదురుకొని కూసున్నడు పెద్దన్న.

“కని అప్పట్నించి మీ లీడర్లు ఎలక్షన్లంట దానెంబడి వద్దరు. మీ లీడర్లు జెప్పినట్టు నువ్విన్నవు నీ తప్పేందిగని. కని నువుగూడ కొన్ని మంచి పన్లే జేసినవు గని. గౌండ్లోల్లను సంగం పెట్టుకొమ్మని యెంటబడి పెట్టిచ్చినవు. చేనేత సంగం బెట్టిచ్చినవు. పొరుగూర్లున్న దొర దగ్గరికోయే పంచాదులన్ని వూల్లెనే తప్ప అయేటట్టు జేసినవు. దొరలు కలాల్ మాములాగుత్త పట్టనిత్తలేరని మనూరోల్లను గొట్టిచ్చి మనోల్ల మీదనే కేసులువెడితె నువ్వు వకీల్ల పెట్టిచ్చి కొట్లాడినవు. ఎవనికి జెనుకలే.

హరిజనులకు కొట్లాడి ఇండ్ల జాగలిప్పిచ్చినవు. కొందరికి కరెంటు బాయిలు గూడ మంజూరి చేయించినవు. ప్రాథమిక వ్యవసాయ సహకార బ్యాంకు పెట్టించినవు. బ్యాంకులల్ల అప్పులు కావాలనోల్లకు అప్పులిప్పిచ్చినవు. గివన్ని పనులు జేసెటాల్లకు నీకు నీ స్వంతం పనిచేసుకునటానికి టైం దొరకకుంటయింది.

ఇగ గందుకే నువు జేత్తున్న పనులల్ల కర్సులైన దాంట్ల కొన్ని నీ కర్సులు గూడ కలిపి వసూలు జేసుకున్నవు. కని అదిగూడ పెద్ద తప్పేం లేదు. మరి నువ్వెట్ల బతుకాల్నే. నీగ్గూడ కడుపున్నది గదనే. కని నిన్ను గిట్టనోల్లు పైరవికారు అన్నరు. అంటే అననీ అని నీపని నువ్వు చేసుకుంట బోయినవు. ఆనాడు ఏం లేనోనివి ఇయ్యాల ఇంత భూమి కొనుక్కున్నవు.

ఇంత బ్యాంకుల అప్పులిచ్చెటాల్లకు బావులు తవ్విచ్చుకున్నవు. బ్యాంకులు అప్పులిత్తె కరెంటు మోటార్లు పెట్టిచ్చుకున్నవు. ఇప్పుడు కొంచెం మంచిగనే బతుకుతున్నవు. మోతుబరులకంటె కొంచెం మంచిగనే బతుకుతున్నవు. మోతుబరులకంటె కొంచెం మంచిగనే అయినవు. నలుగురు పిలగాన్లున్నరు. ఇంత సంపాయించుకున్నవు గని గిదీన్ని గూడ ఇపుడేమంటలేను.” అని పెద్దన్న పుట్టు పూర్వాలన్ని జెప్పిండు.

ఎక్కడెక్కన్నో తిరిగే పెద్దన్నకు మనగ్గూడ తెలియని సంగతులు కొన్ని ఎట్ల

తెల్సినయిని, పూసగుచ్చినట్లు సెపుతున్నడు అరె అని విచిత్రపడ్డరు ఆల్లు ముగ్గురు.

"అన్ని మంచిగనే సేసినవు గని ఒకకాన్నె పోగొడ్తున్నవే రాజన్నా" అన్నడు మల్ల పెద్దన్న శాంతంగనే.

కని గా మాటనేటాల్లకు రాజన్న గుండెల బాయిల బండేసినట్టయింది. నేను గీడిదాక బోయత్త అని లేసిండు ఈరేశం. తాల్లకేయి నడిసిండు.

"ఈల్లు సంగం బెట్టుకుని సమ్మె జేసినప్పుడల్ల నువ్వు గిట్లెట్ల అని కొట్లాట పెట్టలేదు. ఇటు ఈల్లను అటు మోతుబరులను ఇద్దరిని సముదాయించి కూలీలు జీతాలు పెంచుటానికి తోడుపడ్డవు. ఇపుడు మీ వూల్లె కూలీలు, పక్కపొంటి పల్లెలకంటె ఆఠానా రూపాయి ఎక్కోనేవున్నయి. జీతాలైతే మున్నూరుదాక ఎక్కోవున్నయి. గివ్వన్ని సరె మంచిగనే సేసిన్రు కాదన!

అందరికి అన్ని తీర్ల సాయం జేసినవు. గందుకే మొన్న వోట్లల్ల నిలవడితె నువు జేసిన సాయానికి అదలుకు బదులుతీర్గ నీకు వోటేసి సర్పంచిని జేసిన్రు. కని గపుడు గింత కూలీలు జీతాలు పెంచిపిచ్చినంక గూడ నాకు వోటెయ్యరా మీరు అని, ఓట్లను బహిష్కరిస్తరా అని మనసుల కోపం పెట్టుకున్నవు. ఇరువై మూడోట్లు ఎక్కో అచ్చి గెల్చినవు. కొద్దిల అటుయిటు అయితే వోడిపోదువు గద! నాకు వోటేత్తె ఈల్ల ముల్లేం మునిగిపోవు. ఈల్లు వోట్లెయ్యకపోతే ఎవడో ఒగడు గెల్వక ఆగుతదా? అని అనుకున్నవు. గిట్ల అనుకునుడు గూడ నీ మనసుకు వట్టిసూత్తె నిజమే గావచ్చు. నువ్వు గట్ల కోపం బెట్టుకున్నందుకు నిన్నేం అంటలేను. సాయం జేసినకాడ ఎవరైన యింత ఆశపడతరు గద! ఓట్లతోటి వొగడువోయి వొగడెక్కుతడు మీద! కని ప్రజల నెత్తిమీద ఎక్కుడయితె పోదుగదనే. అందుకు ఈ వ్యవస్థనే మారాలెగని ఎక్కే మనుసులు, దిగే మనుసులు కాదు గదనే. గిట్ల మేం నమ్ముతున్నమని గూడ నీకు తెల్వందిగాదు. గట్ల తెల్సిగూడ ఆశపడుడు మా తప్పెట్లయితదే."

తాళ్ళళ్ళకోయిన వీరేశం కమ్మదొప్పల యిన్ని ముంజలు పట్టుకచ్చిండు. అందరి ముంగట వెట్టిండు.

పొద్దు పూర్తిగ గూకింది. మొగులుమీద ఎర్రరంగు యిచిత్రంగ మాయమైతంది.

ఇగ రారనుకొని మిగిలిన కల్లుకుండలు కావడి బద్దకు తగిలేసుకొని ఆకరోల్లు గూడ యెల్లిపోతాన్రు. ఎవలో ఇంట్ల పిలగాండ్లకోసం ముంజలగొల కావడికి తగిలేసుకున్నడు. కల్లు మండువకాడ బజ్జీలమ్మె అయిలిగాడు గుడ సదురుకొని ఎల్లిపోతండు. అంత దూరాన్నించి తునికాకు డాగులు తీసుకపోతున్న ఎడ్ల కచ్రం బరువుకు మెల్లమెల్లగ బోతున్నట్టుంది. కచ్రం ఆపి ఎవలనో బిలిసి బ్యారంజేసి యింత కల్లుబొట్టు తాగుతున్నట్టున్నడు ఎడ్ల తోలుతున్న మనిషి.

“మంచియో చెడ్డయో గని నువ్వు జేసిన అన్నిటికి ఓర్చుకున్నం. కని నువ్వొకటి మర్చిపోయినట్టున్నవు. సంగం బెట్టుకున్నది ఒక్క కూలీలు జీతాలు పెంచిపిచ్చు కునుటానికే గాదే తమ మీద ఎవల పెత్తనం లేకుంట సూసుకునుడుగూడ సంగం పనేనే. గందుకే ఏదన్న వాల్లండ్ల వాల్లకు పంచాదుబడ్డ, వాల్లతోటి యింకోల్లకు పంచాదుబడ్డా పంచాదు తెంపేది మధ్యవర్తులు గాదే. సంగం ఆ పని జేత్తది. నీకు గిక్కన్నే కోపమచ్చింది. నా పెద్దిర్కం పడిపోతున్నదని కక్ష గట్టినవు. కని ఒకటి గమనించుతలేవు. పెద్దపెద్ద దొరలంత మట్టిగరుస్తన్నరు. నువు సూత్తలేవని కాదు. గంత పెద్దపెద్దోల్ల మాటనే అడ్డంపన్నపుడు నీదెట్ల సాగుతుందను కుంటున్నవే?”

ఒక్కొక్క ముంజ పొట్టుదీసి తింటున్నరు అందరు. ముంజలైపోయినట్టున్నయి. ఒక్కటి మిగిలినట్టున్నది. నువుదిను అంటె నువ్వేదిను అని అనుకొన్నంక ఆఖరికి పెద్దన్న తీసుకున్నడు. సెట్టు కింద మొకాలు కనపడనంత సీకటైంది. సీకటైందే నయమనుకున్నడు రాజన్న. తను బయపడ్తున్నది తెల్వకుంటైం దనుకున్నడు.

ఓసారి సంచిల సెయ్యిపెట్టిండు పెద్దన్న. రాజన్న గుండె బిక్కుబిక్కుమన్నది. కత్తే దీత్తడో, బాంబే దీత్తడో, యింకేమన్నదీత్తడో, తీసి ఏం జేత్తడో అని వులిక్కి పడ్డడు. ముంజలు దిన్నసెయిని సంచిలున్న తువాలకు తుడుసుకొని మూతి గూడ తుడుసుకొని మల్ల సదిరిండు పెద్దన్న.

“హవ్వల్ల!” అని మల్ల కుదురుకున్నడు రాజన్న.

“వూర్లె నీ మాటనే యినాలనేది యిడిసిపెట్టు. నీ బతుకేందో నువు బతుకు, అప్పులు అవ్వోటివ్వోటి యిప్పిత్తె యిప్పియ్యి గని కమీషన్లు గుంజుడుమాత్రం యికనుంచి కుదురది. కర్చులపేరిట వసూలుజేత్తె గూడ ఎవలూరుకోరు.” ఖరాకండిగ చెప్పిండు. మొగిలి అందుకున్నడో మాట.

"గంతే గాదు. గ్రాంపంచాయతి పెండ అగ్రాసుపైసలు, బంజరుదొడ్డి పైసలు లెక్కజూపియ్యాలె. మేం బడిల అగ్రలుసాల్తలేవని రెండగ్రలు గట్టిచ్చుటానికి వసూలుజేసిన పైసలలెక్క మేం జూపిత్తం. గ్రాంపంచాయతి పేరుమీద జమజేసి లెక్కరాయకుంట తిన్న పైసలు మాత్రం నువ్వు లెక్కజూపిచ్చి యియ్యాలె. అవిటితోటి బల్లెపోరగాన్లకు బెంచీలు జేపిత్తం. నువ్వు లెక్కసూపియ్యకపోతె సంగం మీటింగ్గైనపుడు అందరు గల్సి ఎంతలెక్క దీత్తరో గంతకు ఒప్పుకోవల్సివత్తది మరి" అని అన్నడు.

"మంచిది మంచిపనికుపయోగపడ్తయంటె అద్దంటనా?" అని అన్నడు రాజన్న.

"సీకటైంది. ఇగపోదామా" అన్నడు పెద్దన్న – అందరు లేసిగ్రను.

"మీరు నడువుగ్రని. మొగిలి నన్ను గీడిదాక పడగొట్టి అత్తడు" అని పెద్దన్న అన్నడు. మొగిలి పెద్దన్న ఆన్నే ఆగిగ్రను. మిగిలినోల్లు అచ్చిన తోవ వెంట ముంగటికి నడిసిగ్రను. రాజన్న మనసుల మనసులేదు అన్నయన్ని మల్ల యాజ్జేసుకుంటున్నడు.

ఇంతకు నన్ను మెచ్చుకున్నరా! తిట్టిగ్రనా మర్యాదగా అడిగిగ్రనా! బెదిరిచ్చిగ్రనా! ఏది సమజుగాక బుర్రగోక్కున్నడు. ఆలోసించుకుంట నడిసెటాల్లకు తట్టుకొని బోర్లపడబోయి తమాయించుకున్నడు.

"ఏమాయానే సీకట్ల సూత్తలేవ." అన్నడు శంకరి.

"సీకట్ల కనపడకపాయె" అన్నడు రాజన్న.

ఏమ్మాట్లాడ్తలేరు. సప్పుడుజేక నడుత్తున్నరు. రాజన్నకు ఒక ముచ్చటైతె ఎంతకు సమజైతలేదు. మొన్న గంతగనం లొల్లయి పానాలమీదికొచ్చిన పోలీసోల్లను పిలిపించిందెవలు అని ఒక్కమాట అడుగకపాయె ఏందని, పెద్దన్న గట్లడుగకపోయెటాల్లకు "నువ్వే పోలీసుల పిలిపిచ్చినవటగద! ఏం సంగతి ? బతకబుద్దయితలేద వూల్లె" అని అన్నదానికంటె ఎక్కువ పరేషానైతండు. ఇంతకు తనను యీల్లు నమ్మినట్టా? నమ్మనట్లా? గట్ల అనుకుంటనే వున్నడు, ఆలోచనలు ఎంతకు తెగుతలేవు.

శంకరి ముంజలు యిగ అయిపాయె దగ్గరవడె అని ఏదో ముచ్చట ఈరేశం తోటి మాట్లాడుతండు. వానలెప్పుడు పడ్తయి ఈ యేడు పంటలెట్లుంటయో

గసుంటి ముచ్చట్లు మాట్లాడుతండ్లు. ఊరుజేరచ్చిన్రు. ఎవరిండ్లల్ల కాల్లువోయిన్రు. ఆ రాత్రంత ఆలోచించుతనే వున్నడు రాజన్న.

5

గిదిజరిగినంక పాయిందెసాలకు పోలీసులచ్చి మొగిలిని, శంకరిని, ఈరేశంను ఏదో వూరికోయిరాంగ తొవ్వల పట్టుకున్నరు. టేసన్లేసి పొట్టుపొట్టు కొట్టిన్రు. మూడ్రోజులకు కేసుగీసు ఏం బెట్టకుండనే యిడిసిపెట్టిన్రు. వూరోల్లకు వాళ్ళచ్చే దాక గీసంగతి తెల్వది. ఏదో వూరికోయింద్రనే అనుకున్నరు. ఇంతల వోనాడు పోలీసుల పిలిపిచ్చి ముందుగాల గొట్టిచ్చిందెవలో తెల్సిపోయింది. అందరనుకొని ప్రజాకోర్టు బెట్టిన్రు. కమినిష్టు రాజన్నను మందిముందల నిలబెట్టిన్రు.

"ఇదంతెందుకు జేసినవో యిపుడీమంది ముందల సెప్పాలె" అన్నడు మొగిలి రాజన్నతోటి.

రాజన్న మొకం తుమ్మల్ల పొద్దుగూకినట్టయింది. తల్కాయ వంచుకోని నిలవడ్డడు. అట్లనే తల్కాయె వంచుకోని కండ్లుమాత్రం ఎత్తి మందివంక సూసిండు. అందర్ని జూడంగనే భయం బుచ్చుకున్నది. ఆనాడు పెద్దన్న వదిలిండుగని యియ్యాల మంది వదిలెటట్టులేరు అనుకున్నడు. అంతమందిల ఎవలో పట్రుమని అగ్గిపుల్ల గీకిండు. పక్కనున్న యాపసెట్టు మీద ఓ కాకి కయ్యర కయ్యరమని ఒర్రుతాంది. ఆ యాపసెట్టు సందులకెల్లి ఎండ రాజన్న మెడమీద సురుక్కు సురుక్కుమని పొడుత్తాంది.

"ఇగ పన్లెపని ఆడు మొదట్నించి జేసినయి యిసారించుర్రి" అని మందిలకెల్లి ఎవడో అన్నడు.

"ఇన్నేండ్ల కాన్నించి ఎన్ని జేసుకుంటత్తాండు. అవిప్పిత్త. యివిప్పిత్త అని పైరవి జేసుటాన్కి పైసలుగావాల్నని ఎన్ని వసూలుజేసిండు? యిప్పుడయన్ని బయటికి గుంజాలె" అని మందిదిక్కు జూసి 'చెప్పరేం వుర మీరంత బోర్లబడ్డోల్లు గాదా' అన్నడొకడు. రాజన్న వంచిన తలెత్తలే. కాల్లల్ల వణుకుడుబుట్టింది. ఆ వణుకుడు కనబడితె మానంబోద్దని నిగ్రదన్ని నిలబడ్డడు.

"మంది అడుగుతాంటె జెప్పవేంది. యిన్రోజులు జేసింది ఎవడు

బట్టిచ్చుకోలెయిది గట్లనేవోతదనుకున్నవు కనియ్యాల నీ పాపం బండింది. అన్నలబట్టిచ్చెటానికి జూసినవ్ అన్నలరిగోసబడి తప్పించుకున్నరు. పెద్దన్న వచ్చి నీ సంగతి నీకు గురుతుజేసిపోయిండు. అప్పుడుగూడ నువుదెల్సుకోలే. మళ్ళ మమ్ముల బట్టిచ్చినవ్. యిదంత వట్టిగనే మాట్లాడుతలేం. నీ పన్లకు సాక్షం నీవోల్లె. ఎంకటిగాడు, మల్లిగాడు యిద్దరున్నరు. యింతమందిల వున్నదున్నట్లు శెప్పు, మంది శెప్తరు. అందాక రానిత్తవా లేకపోతె తప్పయిందని ముందుగాల నువ్వే వొప్పుకుంటవా" శంకరి అన్నడు.

రాజన్నకు బట్టలిడిపిచ్చి బరిబత్తల నిలబెట్టి అందరు తుప్పర తుప్పర వూంచినట్టయింది. ఏం మాట్లాడటానికి తోసలె. అందరికి అంత ఎరికె. తంతరో, గుద్దుతరో తప్పయిందని ఒప్పుకుంటె నాలుగు మాటలని మందలిచ్చి వదిలిపెడుతరనుకున్నడు. చిన్నగ మెడలెత్తి "చేశినయన్ని తప్పులె యిప్పుడు మీరంటుంటె దెలుత్తాంది. యింగ యీసారి జెయ్య" అన్నడు మెల్లగ. ఆ మాటలు మొగిలికి, శంకరికి, వీరేశంకు తప్ప ఎవలకినబడలె.

"ఏమో అంటడేంది వాడు. జరంత గట్టిగ అనుమన రాదుర్రి."

"ఏందో అక్కన్నే గుయ్యగుయ్యమంటాండు?" మందిలకెల్లి మాటలినబడ్డయ్.

"తప్పయిందని ఒప్పుకుంటాండు" యీరేశం అన్నడు.

"అదే! మీకే జెప్తడటనా మా అందరిదగ్గెర పైసలు దొబ్బుడెరికేగని, మా కొంపలు ముంచి మమ్ములందర్ని యింటిసుట్టు దిప్పుకునుడెరికెగాని యిప్పుడేమో మీ చెవులల్ల తీకనాలుదీత్తాండు?" ఒగడన్నడు.

"గదేందో గట్టిగ జెప్పుమన్నాదుర్రి" ఒర్రిండొగడు,

"అందరికి యినవడెటట్టు జెప్పు" మొగిలి రాజన్నతోటి అన్నడు. రాజన్న సచ్చిన పీనుగతీర్గ అయిండు యిగ తప్పదనుకున్నడు. మానంబోతెమాయె పానం నిలుత్తదనుకున్నడు.

"తప్పయింది యిసుమంటిపన్లు యిగజెయ్యమల్ల" అన్నడు జెర గట్టిగ, ఆ మాటలు గూడ సగం మందికె యినవడ్డయి.

"తప్పయిందంటాండు గద ఇప్పుడేం జేద్దాం మీరే జెప్పాలె" ఈరేశం మందితోటి అన్నడు.

"అవ్వల్లో తప్పుయిందనంగనే అయిపోద్దా గుర్తుండెటట్టుజెయ్యాలె"

"చేసినయన్ని జేశి తప్పనంగనేబోతయా శిచ్చపడాలె"

మొగిలి, శంకరి, ఈరేశం ఒగలమొగాలొగలు సూసుక్నరు ఏం జేద్దామన్నట్టు.

"దొంగ గొడ్డుకు లొటారమెయ్యాలె, దొంగ గొడ్డుకు లొటారమెయ్యాలె" మంది ఒర్రుతాన్రు.

❄ ❄ ❄

రొండ్రోజులయినంక చేతికి సిమెంటు పట్టీ వేయించుకొని దొంగగొడ్డుకు లొటారం గట్టినట్టు నెలరోజులు సెయ్యితాడు మెడల యేల్లాడేసుకోని తిరిగిండు రాజన్న.

**రచనా కాలం 1983. సృజన మాస పత్రిక, ఫిబ్రవరి 1984**

ఈ కథ తెలంగాణ ప్రాంతంలో ఓ ఇన్‌ఫార్మర్‌కు సంబంధించిన కథ. భూస్వాములు వున్నచోట పోరాటాలు వుంటాయి. ఆ భూములు కోసం అన్నలు ఉద్యమంలో పాల్గొంటారు. సహజంగానే పల్లెపల్లెన తెలంగాణలో అన్నలు ఉన్నారు. దొరలు తమ భూములు ఎక్కడ పోతాయోనని పోలీసుల అండ చేరటం మామూలే. కాని అక్కడినుండి కథ మొదలవుతుంది. మిమ్మల్ని కాపాడుతాం గానీ ఆ అన్నల జాడ చెప్పండ్రి. మిమ్మల్ని మేము రక్షిస్తాం అని ఊళ్ళో ఉన్న మోతుబరి రైతులతో పోలీసులు నిత్యం సంబంధాలు కొనసాగిస్తారు ఈ కథలో.

ఇన్‌ఫార్మర్లను ఊళ్ళో జనంనుండి ఎలా ఏరివేయాలి అనేదే ప్రధానంగా ఈ కథలో కనిపిస్తుంది. పోలీసులనుండి తప్పించుకోవటం కన్న తనముందు ఉన్న ఇన్‌ఫార్మర్‌ను తప్పించటం ఎట్లా అనేదే ఇక్కడ కనిపిస్తుంది.

అందుకే ఒకటి, రెండుసార్లు పోలీసుల దాడులకు ఎవ్వడు కారణమో వెతుకుతారు. వాణ్ణి చూసి ఊళ్ళో నుండి వెలేసినట్టు చేయాలనే ఉద్దేశంతో ఇన్‌ఫార్మర్‌కు 'దొంగగొడ్డుకు లొటారం'లా మెడకు ఓ సిమెంటు తాడుకట్టి నెలరోజులు తిరగాలని శిక్ష వేస్తారు ఈ కథలో. అన్నలు కార్యక్రమాలకు ఎవ్వడు ఎదురొచ్చినా ఈ శిక్షలే కాదు. ఇంతకన్న పెద్దశిక్షలు వుంటాయని ఈ కథ చెపుతున్నట్టు కనిపిస్తుంది.

**- నందిగామ నిర్మలకుమారి**

(ఎం.ఫిల్ నుండి)